# మృత్యోర్మా......



రంగయ్య చరమ దశలో మంచంమీద పడుకుని ఉన్నాడు. చుట్టూ భార్య, కొడుకులూ, కోడళ్ళూ, బంధువులూ గుడ్లనీరు గుడ్ల కుక్కుకుంటున్నారు. కొందరు ఆపుకోలేక బయటికే ఏడుస్తున్నారు.

రంగయ్య అందరివైపు కలయచూశాడు. 'ఎందుకు ఏడుస్తారు?'అని అడగాలనుంది అతనికి. కాని మాట రావటం లేదు. భార్యచుక్కమ్మ పెద్దబొట్టు పెట్టుకుని, చేతులకి బంగారు గాజులు వేసుకుని ఎదురుగా వుంది. చుక్కమ్మకి తన సౌభాగ్యం ఇంకిపోయే రోజు దగ్గరకొచ్చిందని అర్థమైంది. మాటి మాటికీ లోపలికెళ్ళి పెట్టుకున్న బొట్టుమీదే మళ్ళీ మళ్ళీ కుంకం మెత్తుకుని అద్దంలో మళ్ళీ మళ్ళీ ముఖం చూసుకుంటుంది. బంగారుగాజులు కావాలని ఆడిస్తుంది. ఆ గలగలకి గుండె తుళ్ళిపడగా కుళ్ళి కుళ్ళి ఏడుస్తుంది. నెరిసిన తలపాపటలో ఇంత కుంకం అద్దుకొని భర్త దగ్గరకొచ్చి ఆయన కళ్ళలోకి చూస్తుంది.

రంగయ్యకి భార్యనిగురించిన ఆలోచనలు. చుక్కమ్మని చేసుకోవటం రంగయ్య కిష్టంలేదు. కార్యం రోజున చుక్కమ్మని వేరుగా పడుకోబెట్టాడు. పండు తినలేదు. పాలు తాగలేదు. చుక్కమ్మ ఒక్క మాట మాట్లాడలేదు. ఆయన సేవ మానలేదు.

తనే వేరుగా వెళ్ళి పడుకోటం మొదలెట్టింది. ఆర్నెల్లు గడిచింది. ఒక రోజున తన దుప్పటి తను తీసుకుని వేరుగా పడుకోటానికి వెళ్తున్న చుక్కమ్మని చూశాడు. జడనున్న మల్లెచెండు జాలిగా వూగుతుంటే 'అయ్యో పూలు ఏడుస్తున్నాయి' అనుకొని తనే వెళ్ళి చుక్కమ్మ పక్కలో చోటు అడిగాడు.

ఆపైన చుక్కమ్మ ఇద్దరు కొడుకుల్ని, ఇద్దరు కూతుళ్ళని కన్నది. వాళ్ళు పెరిగి పెద్దయ్యారు. పెళ్ళిళ్ళయ్యాయి. అంతా బాగానే వుంది. కాని చిన్న కొడుక్కి తను చెప్పిన సంబంధం చేయలేదని చుక్కమ్మకి మొగుడిమీద కోపం. 'ఇంకా కోపం పోలేదా!' అనడగబోయాడు రంగయ్య. కాని మాట పెగలటం లేదు.

కాళ్ళ దగ్గర పార్వతి కూర్చొని రంగయ్య కాళ్ళొత్తుతోంది. రంగయ్య పార్వతిని చేసుకుందామని కలలు కన్నాడు. కాని అది ఇంకో ఇంటి కోడలయింది. అయినా సరే కాపరానికెళ్ళి పిల్లల్ని కన్నా పార్వతి రంగయ్యని చిన్నప్పుడు ఎలా చూసేదో అలాగే చూస్తుంది. అంత గల గలా నవ్వుతూ చనువుగా మాట్లాడుతుంది. అలనాడు జమ్మి కొమ్మ అందక ఎగురుతున్న పార్వతిని ఆపి, తను ఓ రెమ్మ తుంపి జడలో తురిమినప్పుడు గిలిగింతలుగా నవ్వినట్టు, ధ్వజస్తంభం కింద కొబ్బరిచిప్ప పగలకపోతే, కాకెంగిలి కూడా వద్దని, ఒకే ముక్కని ఇద్దరూ కొరుక్కు తింటున్నపుడు కళ్ళలో ప్రేమ నింపుకుని, ప్రాణం పోసుకుని, ఆ ప్రేమ, ఆ ప్రాణం అంతా నువ్వే అన్నట్టు చూసింది. ఆ చూపు మార లేదు. నా సంసారం., నీ సంసారం వేరయినా 'నా మనసు నీదే గదయ్యా' అన్నట్లు తన్ని చూసి పొంగిపోయే పార్వతి మెత్తగా కాళ్ళొత్తుతూ కళ్ళు దించుకు దుఃఖిస్తోంది. "అదంతా ఒక ఆటే! ఎందుకు ఏడుపు?" అనబోయిన రంగయ్య దృష్టి కొడుకులమీద పడింది.

తన ఎత్తుకు మించిన కొడుకులు.ఏపుగా పెరిగి, వ్యక్తులయి పనిమంతులయి వూళ్ళో మంచి పేరు తెచ్చుకున్న కొడుకులు. తనకు మనవల్ని కనిచ్చిన కొడుకులు. పిచ్చి నాయన్లారా ఎందుకురా ఏడుపులు! నా కంటె గొప్ప వాళ్ళు కావాల్రా! నా కాలంతీరి నేను వెళ్ళిపోతున్నాను. అమ్మ జాగ్రత్త! అని చెప్పబోయాడు. పక్కనే కోడళ్ళు. రెండో కోడలికి కావలసిన నగలు పెట్టలేదని

తనమీద కోపం. ఈ ముసలాడు ఎప్పుడు పోతాడా అని చూస్తోంది. కాని ఏడుస్తోంది.రంగయ్య తమ్ముడు ఏడుపు నటిస్తున్నాడు. లోపల సంబరంగా ఉంది అతను పోగానే వాటా పంచుకోటానికి.

అటు చూస్తే కామయ్య,పుల్లయ్య, రామన్న, సోములు తన చిన్ననాటి స్నేహితులు. చిన్నప్పుడు బిళ్ళంగోడూ, చెర్ పట్టీలు ఆడుకుని కృష్ణలో ఈతలు కొట్టి, ఇసకలో చెడుగుడు ఆడి చెట్టా పట్టాలేసుకుని వెన్నెల రాత్రిళ్ళంతా తిరిగి ప్రాణానికి ప్రాణంగా మసిలిన స్నేహితులు. "ఏడవకండ్రా! మీరూ నన్నొచ్చి కలుస్తారు కదరా" అనబోయాడు.

అందరూ ఏడుస్తున్నారు.

"ఏడుపు ఆపండి" పెద్దగా అరుద్దామనుకున్నాడు రంగయ్య.

"ఓరి నాయనలారా, సంతోషించవలసిన సమయంలో ఏడుపెందుకురా. నా పెళ్ళాం, నా పిల్లలు, నేను శాశ్వతంగా ఉండమని తెలుసు గదరా! కలసి వున్నాం కాబట్టి మమకారం పెంచుకొని ఆ మాయలో ఆడుకున్నాం. నాకు మరికొన్ని క్షణాల్లో విముక్తి రాబోతోందిరా! ఈ జీవితం, ఈ విసుగులు, కోపాలు, అసూయలు, ద్వేషాలు అన్నింటినించి అందమైన, బహుసుందరమైన విముక్తి నాకు మృత్యువు ప్రసాదిస్తుంటే ఆ మృత్యువుకి భయపడి ఏడుస్తారేమి? పుట్టిన తర్వాత మనుషులు, డబ్బు, వస్తువులు శాశ్వతాలు కావు గదా! శాశ్వతమైంది సత్యమైంది మృత్యువు ఒక్కటే. ఖాయంగా, ఖచ్చితంగా సత్యమైన ఆ మృత్యుమూర్తి, ఆ అమృతమూర్తి ఈ జీవుడి దగ్గరకొస్తుంటే నవ్వండిరా .... ఆనందించండిరా .... స్వాగతం పలకండిరా ...." అని చెప్పాలని .....

రంగయ్య ప్రాణ స్పందన ఆగిపోయింది.

జనం గొల్లుమని ఏడ్చారు.

"అయ్యో! నవ్వవలసిన సమయాన ఏడుస్తారేం?" అని రంగయ్య ఎక్కడో పసిపాపై పుట్టి కెవ్వుమన్నాడు *